( సీరియల్ కథ )

# మృగతృష్ణ ★

రచన :
శ్రీ రాధేయ.

[కాలం కొండెక్కుతుంది. కరడుగట్టిన కాంతికిరణాలు నిరాశా నిస్పృహలు వెదజల్లుతున్నాయి. ఈ నిశీధిలో స్వార్థం, సంకుచితత్వం, లేమి విలయ తాండవమాడుతున్నాయి. ఈ వ్యవస్థలో రచయిత రాధేయ మనోఫలకంలో మెరిసే దృశ్యాలు ఆవేదనలు ఆలపించేదే ఈ మృగతృష్ణ కథ.

హృదయ స్పందనవలన ఎక్కడో మిగిలిన మంచితనంలో ఆశావాదియైన మానవుడు కాలానికి ప్రాణం పోస్తాడు. ధర్మం, నవజీవనం, సమభావం చమురుగా ఈ కాలపు దివ్వెగా వెలగాలని. ఆ కాంతిలో విప్లవం, సోషలిజం వర్ధిల్లాలని ఆకాంక్షిస్తాడు మనిషి. మూగబాధలను లెక్కలోచ్చి విహరించేటప్పుడు కలాలనుండి ఇట్టి రచనలు బయల్పడతప్పదు.

'రాధేయ'-కథాక్షేత్రమున తియ్యటి పంటలు పండించ నుద్యుక్తుడైన ఉత్సాహవంతుడు. భావోద్రేక ఫలితంగా వెలువడే భావాలు మెదడుకు మేతగా చదువరుల నలరించాలని ఆకాంక్షిస్తున్నాను.

—సంపాదకుడు.]

★

చిన్న కుదుపుతో క్రిష్ణాపురం స్టేషనులో ఆగింది ప్యాసింజరు ట్రెయిను. ఆ స్టేషనులో దిగేవారు లేకపోయినా ఎక్కేవారు బహు కొద్దిమంది మాత్రమే వున్నారు. ఉదయం నుండే ప్రయాణం చేస్తూ అలిసిపోయిన ప్రమాణీకులు ఆ కాస్త వ్యవధికే రిలీఫ్ చిక్కినట్లుగా ఊపిరి పీల్చుకోసాగారు. పచ్చ జండాతో పాటు గార్డు విజిల్ చెవులకుసోకగానే చిత్తం అంటూ శిరస్సు వంచి యుద్ధరంగానికి సిద్ధమయ్యే వీర జవానులా దిక్కులు పిక్కటిల్లేలా విజయశంఖం పూరించి తన నల్లటి పొగలను గాలిలోకి చిమ్మి తెల్లటి మేఘాలను పిప్పిచేసింది. గాలిలో స్వేచ్ఛగాలి ఎగిరే గువ్వలజంటలు ఆ భయంకర శంఖారావలు వినగానే చల్లా చెదరై పోతున్నాయి. క్రమంగా వేగాన్ని పుంజుకుంది రైలు. ఆ వేగాలకి లయబద్ధంగా సంగీతాన్ని ఆలాపిస్తున్నాయి, కమ్మీలపై చక్రాల నడక.

♦ ♦ ♦

సెకెండ్ క్లాస్ కంపార్ట్‌మెంటులో పెద్దగా రద్దీ లేకున్నా ఆ పెట్టెకు సరిపడ్డ యంది నిండి పోయారు. ఆ చిన్న స్టేషనులో ఎక్కిన ఒక యువకుడికి కిటికీ దగ్గిర కాస్త చోటు చేసుకుని తన కేమీ పట్టనట్లు కూర్చున్నాడు. సాగి పోయే రైలుతోపాటు పరుగులు తీస్తున్నాయి అతిని ఆలోచనలు. దాదాపు పాతికేళ్ళ వయసులో నున్న ఆ యువకుడు అందానికి నిర్వచనంలా వున్నాడు. కాని అందుకు తగ్గ పోషణ లేనట్లుంది. అక్కడక్కడా నలిగిన శర్టు మడతలుపడిన ప్యాంటు మాసిపోయి నల్లగా వుంది. అతనికున్న మంచి బట్టల్లో

అవే కాస్త మెరుగనిపిస్తుంది. అతణ్ణి చూస్తే చదువుకున్న యువకుడిలాగా వున్నాడు. చేతిలో న్యూస్ పేపరు పట్టుకొని యున్నాడు. అందులో అతని సర్టిఫికేట్లు భద్రంగా దాచుకొన్నట్లుగా వుంది. అందుకే అతి జాగ్రతగా పట్టుకున్నాడు వాటిని. అతని ముఖంలో నిరాశ నిర్లిప్తత గూడు కట్టుకున్నట్లుంది. ఇతర ప్రయాణీకులు ఏమి మాట్లాడుతున్నారో గూడా పట్టించుకోలేదు. ఆ రైలులో పందెం వేసుకుని పరుగెడుతున్న వృక్షాలనీ చూస్తూ చివరికి అవి అలసిపోయి ఓటమి నంగీకరిస్తూ వెనక్కి మరల పోతూంటె తన కెంతో జాలిగా వుంది. అలాగే జీవితమనే బాటపై పయనిస్తూ గమ్యంకోసం అన్వేశిస్తూ సాగుతూంటె మధ్యలో అలసట విసుగులతోపాటు కష్టాలను ఎదుర్కొంటూ ఒక్కొక్కొప్పుడు వాటిని ఎదుర్కోలేక విలపిస్తూ ఓటమితో రాజీ పడుతూ కన్నీటిని ఆపుకుంటూ పయనం సాగిస్తూనే వుంటాడు మానవుడు. జీవితమనే పంజరంలో భంధింపబడిన మనిషి మానవత్వపు మమకారాలు త్రెంచుకోలేక, పెనవేసుకున్న అనుభంధాలు త్రెంచుకోలేక స్వేచ్ఛా జీవితాన్ని గడపలేక పరిష్కారాన్ని సూచించమని కనుపించని దైవాన్ని నిలదీస్తూ నిస్సహాయంగా నిలుచున్న మానవునికి ఆయన జవాబేమిటో?

అతనికి ఎదురుగా కూర్చున్న క్రొత్త జంట తమకు ఈలోకంతో సంభంధం లేనట్లు స్వప్నలోకంలో విహరిస్తున్నారు కాబోలు. ఒకరినొకరు తృప్తిగా చూసుకుంటూ ట్రాన్సిస్టర్ వారు ఆన్ చేయగానే మరొకరి అనుమతి తన కవసరం లేదంటూ పాట అందుకుంది.

"అన్నా నీ అనురాగం ఎన్నోజన్మల పుణ్యఫలం" అంటూ పి. సుశీలా గొంతు సుమధురంగా విన్పిస్తుంది.

ఎదురుగా నిరాశ అయి కృంగిపోతున్న



★

"డ్రైవర్ రాముడు" చిత్రంలో ఎన్. టి. రామారావు, సత్యనారాయణ, మాడా.

★

ఆ యువకుడు ఉలిక్కి పడ్డాడు. మరుక్షణం అతని పెదవులపై జీవంలేని నవ్వు వెలసింది. ఎంతో ఆసక్తిగా ఆ పాటను వింటున్నాడు. కానీ క్రొత్త జంటకు ఆ పాట చిరాగ్గా వుంది. అలా వింటున్న అతనికి గతమంతా ఓ సినిమా రీలులా కళ్ళముందు కదలాడింది.

ముచ్చటగా మూడేళ్లు పూర్తిచేసుని బి. ఎ. ఫస్ట్‌క్లాస్‌లో పాసైన సారథికి ఆ మూడేళ్ళ జీవితం ఒక మధుర స్వప్నంగా గడిచిపోయింది. తండ్రి పోయిన తరువాత తన భాధ్యతనంతా తల్లి మోసింది. తన చదువుకై ఉన్న అయిదు ఎకరాలలో మూడెకరాలు తాకట్టు పెట్టి చదివించింది. ఇంకా కొన్ని అప్పులకు ఆ రెండెకరాలు సరిపోతాయి. ఇక తనకు మిగిలింది వారుంటూన్న పల్లెటూరిలోని ఇల్లు మాత్రమే. తన కొడుకు పట్నంలో చదువుకోవాలి, వాడు ఆఫీసరుగా ఉద్యోగం చేయాలని తలచిన జానకమ్మ, పట్టుదలతో ఒల్లు గుల్ల చేసుకుని కష్టపడుతూ డబ్బు పంపించేది కొడుకుకు.

అన్నయ్యను కాబోయే ఆఫీసరుగా ఊహించుకుంటూ తన తరువాత తల్లికి హాయిగా కాలం గడిపేందుకు వీలుంటుందని అన్నయ్య మీద ఎనలేని మమకారంతో నున్న ఒక్కగా నొక్క ముద్దుల చెల్లెలి శాంత.

ఇక ఇంటికి వెళ్ళాలి, నా తల్లీ, నా చెల్లెలకు నా మీద ఉంచుకున్న ఆశలకు ప్రాణ ప్రతిష్ఠలు చేయ్యాలి. ఇకనుంచి ఉద్యోగాన్వేషణ ప్రారంభించాలి అని అనుకున్నాడు ఆ రోజు కాలేజి ఆవరణంలో.

జీవితంలో ఈలాంటి లైఫ్ రాదేమోనన్న ఆవేదన ఒక వైపు, మరొకవైపు తనమీదే


మీ బంధుమిత్ర సమేతముగా దర్శించండి!!

# కోడైకానల్

దక్షిణ దేశంలో వేసవి కాలపు విశ్రాంతి కేంద్రం.
మీరు విశ్రాంతి పొందుటకు అధునిక
సదుపాయాలతో కూడిన

# హాలిడే హోం

(విశ్రాంతి మరియు భోజన భవనం)

కోడైకానల్ - 624101.

ఫోన్ : 257 గ్రామ్స్ : "హాలీడేహోం"

8-4-79 నుంచి ప్రారంభమై వేసవి కాలం పూర్తి అయ్యే వరకూ తెరిచియుండును. రుచికనుగుణమైన, పాశ్చాత్య ఫక్కీలోకాని, భారత సంప్రదాయ రీత్యాకాని (శాఖాహార మరియు మాంసాహార) భోజనం ఇక్కడ సమకూడుతుంది.

———ఇదికూడా మనదే———

# హోటెల్ జయా

ఫోన్ : 462 గ్రామ్స్ : "జైటీజే"

మరియు

# హోటల్ జయరాజ్

(బసచేయుటకు మాత్రమే)

ఫోన్ : 348 గ్రామ్స్ : "జయరాజ్"

★★★★★

సంవత్సరం పొడుగునా తెరిచియుండే...

# ...పాక్కియ దీపం...

(రుచికరమైన శాఖాహార భవనం)

బస్‌స్టాండ్ రోడ్డు - కోడైకానల్ - 624101.

--ATHMAS

ఆశలు పెట్టుకుని బ్రతుకుతున్న తల్లి చెల్లెలు ఆశలు తన ముందు దీనంగా కన్పిస్తుంటే-ఛ-ఛ ఇంకొకరిని కష్టపెడుతూ నేను సుఖంగా కూర్చోనా? లేదు వారిని సుఖపెట్టాలి. నా చెల్లెకి ఒక మంచి సంబంధం తెచ్చి పెళ్ళి చేయాలి. ఆ తర్వాతే నా జీవితాన్ని గురించి ఆలోచిస్తాను. అని మనసులో దృఢనిశ్చయం చేసుకుని మిత్రులుతో కలిసి ఆ రోజు సరదాగా హోటల్‌కు వెళ్లాడు.

వస్తానురా మధు! ఇంకా పై చదువులకు, వెళ్ళేందుకు నాకు స్తోమత లేదు, నా ఆర్థిక పరిస్థితి, ఇబ్బందులు నీకు తెలిసినదే కదా? అన్నాడు ప్రాణ స్నేహితుడు అయిన మధుతో వీడ్కోలు తీసుకుంటూ.

ఛ-అలా మాట్లాడకురా. బి. ఎ. ఫస్ట్ క్లాసులో పాసైన నీకు యెం. ఏ. కు సీటు పిలిచి ఇస్తారు. ఏదో ఆవరేజ్ మార్కులతో పాసైన నాకు యం. ఏ. చదవాలన్న ఆశ లేదురా-అన్నాడు మిత్రుణ్ణి కౌగిలించుకొని ఓదారుస్తూ మధు.

నీకేంరా శ్రీమంతుడివి. నీచేత కాని పనులుండవురా. ఈ లోకంలో సామాన్యులకు ఆర్థిక ఇబ్బందులు అన్ని వినాశాలకూ దారి తీస్తాయి. మళ్ళీనీ సామాన్య స్నేహితుడు నీకు తటస్థ పడతాడో లేదో అంటూ ఆవేదనగా వచ్చే కన్నీటిని ఆపుకుంటూ మధున్ను కౌగిలించుకున్నాడు. మధూ! ఏమిటో ఈ జీవితం! తొలి పరిచయంలోనే ప్రాణ మిత్రులంగా మూడేళ్లు కలిసి పోయాం. మళ్ళీ మనం కలుసుకొంటామో లేదో-అన్నాడు సారథి నిరాశగా.

సారధి-అలా మాట్లాడకురా! నేను భరించలేను. ఈ జీవితం అందరికీ వడ్డించిన విస్తరాకురా ఏదో విధంగా ఎదురు దెబ్బలు తగులుతూ మనల్ని నిరాశపరుస్తూ వుంటాయి, అంతటితో కృంగిపోక అశాంతితో అలమటించక కాలంతో రాజీ పడడం నేర్చుకో, మరి అప్పుడు నీ ఆశయాలను నెరవేర్చుకో గలవు. నిరంతరం నిరాశా పూరితమైన జీవితాన్నే గడుపుతూ వుంటే జీవితంలో ఏమీ సాధించలేవురా సారథీ-అంటూ ఉబికి వచ్చే సారథి కన్నీటిని తన కర్చీపుతో అద్దుతూ అన్నాడు మధు.

మధూ! నీలాంటివాడు ఈ సామాన్యుడికి ప్రాణం కావటం నిజంగా నా అదృష్టంరా! అన్నాడు చేతులు పట్టుకుంటూ.

ఎక్కువ తక్కువ అనే బేధాలు, నీవు నేను అన్న తారతమ్యాలు మన నిర్మలమైన స్నేహానికి అడ్డు రాకూడదు తెలిసిందా! ఉత్తరాలు వ్రాస్తూవుండు-ఊరికే ఆలోచిస్తూ దిగులుపడకు అంటూ సున్నితంగా మందలించాడు. అలాగే మధూ! వస్తాను అంటూ కాలేజి మెట్లు దిగి మరొకమారు కాలేజి బిల్డింగు, స్నేహితుల ముఖాలను తేరిపార చూచి ఒక్క నిట్టూర్పు విడిచి రైలులో కూర్చున్నాడు సారథి నీళ్ళు ఉబకిన కళ్ళతో.

♦ ♦ ♦

అప్పుడే బస్సుదిగి ఇంట్లోకి అడుగుపెట్టిన సారథిని చూచి, అమ్మా! అన్నయ్య వచ్చాడే అంటూ పెరటివైపు పరుగెత్తింది శాంతి.

ఏం అన్నయ్యా బాగున్నావా! అంటూ మళ్ళీ గాలిలో దూసుకువచ్చిన చెల్లిని చూసి మురిసిపోయాడు సారథి. బాగున్నాను కాని ఏంటిలా కుప్పిగంతు లేస్తున్నావ్? ఏదైనా తట్టుకుని క్రింద పడిపోకు జాగ్రత్త సుమా అన్నాడు నవ్వుతూ.

ఛీ-పో-అన్నయ్యా! నీ వెప్పుడూ ఇంతే-ఇంకా నేనేం బస్తి పిల్లనుకున్నావా?

(సశేషం)